ట్రెండింగ్‌లో జిలేబీ

చండీగఢ్, అక్టోబర్ 8: హర్యానా ఎన్నికల్లో ప్రజలను ఆకర్షించేందుకు 'జిలేబీ'తో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తియ్యటి జిలేబీని ఎన్నికల ప్రచారాస్త్రంగా ఆయన మార్చుకున్నప్పటి చేదు ఫలితాలే వచ్చాయి. హర్యానాలో ఎన్నికల ప్రచారం చేస్తున్నప్పుడు కాంగ్రెస్ నేతలు గొహానాలో బాగా ఫేమస్ అయిన లాలా మథురామ్ హల్‌వాయి అనే మిఠాయి దుకాణం నుంచి జిలేబీని తెచ్చి రాహుల్ గాంధీకి ఇచ్చారు. దీనిని రుచి చూసిన రాహుల్.. తన జీవితంలో ఇంత అద్భుతమైన జిలేబీని తినడం మొదటిసారి అని కితాబిచ్చారు. హర్యానా జిలేబీ ప్రపంచ వ్యాప్తం కావాలని, జిలేబీ తయారీ పరిశ్రమలు నెలకొల్పాలని సైతం ఆయన పేర్కొన్నారు. హర్యానా ప్రజల ఇష్టమైన వంటకాన్ని ప్రశంసించడం ద్వారా వారి ఆకట్టుకునేందుకు ఆయన ప్రయత్నించినప్పటికీ ఓట్లు కురిపించలేదు. ఇక ఈ రోజు కౌంటింగ్ ప్రారంభంలో కాంగ్రెస్ ఆధిక్యంలో కనిపించింది. దీంతో ఆ పార్టీ నేతలు జిలేబీ పంచుకున్నారు. కానీ ఆ తర్వాత బీజేపీ పుంజుకుంది. దీంతో కమలం నేతలు కూడా కాంగ్రెస్‌కు కౌంటర్‌గా జిలేబీ ఆర్డర్ చేసి హస్తం పార్టీకి చురకలంటించారు. దీంతో ప్రస్తుతం 'జిలేబీ' ఎక్స్‌లో ట్రెండింగ్‌గా మారింది.

అతి విశ్వాసం పనికిరాదు:కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు ఊహించని షాక్ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో 'అతి విశ్వాసం పనికిరాదని హర్యానా ఎన్నికలు చెబుతున్న అతిపెద్ద గుణపాఠం' అని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తున్నది. ఈ ఎన్నికల్లో పొత్తుపై కాంగ్రెస్, ఆప్ మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో 89 స్థానాల్లో ఆప్ తన అభ్యర్థులను నిలబెట్టింది. మంగళవారం న్యూఢిల్లీలో ఆప్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

'ఆర్జీ కర్'లో 50 మంది సీనియర్ వైద్యుల రాజీనామా

ఆమరణ దీక్ష చేస్తున్న జూడాలకు సంఘీభావం

కోల్‌కతా: హత్యాచారానికి గురైన కోల్‌కతా వైద్యురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులకు సంఘీభావంగా ఆర్జీ కర్ దవాఖానకు చెందిన సుమారు 50 మంది సీనియర్ వైద్యులు రాజీనామా చేశారు. మంగళవారం ఉదయం జరిగిన విభాగాధిపతుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఎన్ఆర్ఎస్ వైద్య కళాశాల, దవాఖాన సీనియర్ వైద్యులు కూడా రాజీనామాలు చేసే ఆలోచనలో ఉన్నట్టు ఓ సీనియర్ డాక్టర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ వైద్యుల సంయుక్త వేదిక జూనియర్ డాక్టర్లు చేస్తున్న దీక్షకు మద్దతు పలికింది.

హమ్‌సఫర్ ప్రారంభం

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: దేశ జాతీయ రహదారుల వెంబడి అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు ఉద్దేశించిన 'హమ్ సఫర్' విధానాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. ఇందులో భాగంగా హైవేల వెంబడి మరుగు దొడ్లు, శిశు సంరక్షణ గదులు, చక్రాల కుర్చీలు, ఈవీ చార్జింగ్ స్టేషన్లు, పార్కింగ్ స్థలాలు, ఇంధన స్టేషన్ల వద్ద విశ్రాంతి సేవలు వంటి సదుపాయాలను కల్పించనున్నారు. సౌకర్యవంతమైన, సురక్షితమైన, ఆనందకర అనుభవాన్ని ఈ విధానం అందిస్తుందని కేంద్రం తెలిపింది.

కొత్తగా 10 ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొత్తగా 10 ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలను ఏర్పాటుచేయబోతున్నట్టు కేంద్రం తెలిపింది. అలాగే ఈఎస్ఐ కార్పొరేషన్ లబ్ధిదారులకు అమలుజేస్తున్న నిరుద్యోగ భృతి పథకం అమలును 2026 జూన్ వరకు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నది. తాజా సమావేశంలో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ పై నిర్ణయాలు ప్రకటించారు. పీఎంజేఏవై ఎంప్యానెల్డ్ దవాఖానాల్లోనూ ఈఎస్ఐసీ లబ్ధిదారులకు వైద్య సేవలు అందించాలని కేంద్రం నిర్ణయించింది.

హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్

- అనూహ్యంగా హ్యాట్రిక్ సాధించిన బీజేపీ
- 48 సీట్లతో మరోసారి అధికారంలోకి..
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు
- ఫలితాలను అంగీకరించమన్న హస్తం పార్టీ

చండీగఢ్, అక్టోబర్ 8: హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. పదేండ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కలలు కన్న ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. రైతులు, రెజ్లర్ల పోరాటం, పదేండ్ల బీజేపీ పాలనపై ఉండే ప్రభుత్వ వ్యతిరేకతతో ఈసారి గెలుపు ఖాయమనుకున్న చోట హస్తం పార్టీ బొక్కబోర్లా పడింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మూడోసారి అధికారాన్ని కైవసం చేసుకుంది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన మొదట్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాల సరళి కనిపించింది. కానీ, బీజేపీ అనూహ్యంగా పుంజుకొని మ్యాజిక్ ఫిగర్‌ను దక్కించుకుంది. 90 సీట్లకు గానూ ఆ పార్టీకి 48 సీట్లు దక్కగా, కాంగ్రెస్ పార్టీ 37 సీట్లకు పరిమితమైంది. స్వతంత్రులు ముగ్గురు, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డీ) నుంచి ఇద్దరు విజయం సాధించారు. ఆప్ ఒక్క స్థానాన్నీ గెలవలేదు. గత ఎన్నికల్లో బీజేపీ 41 సీట్లు గెలవగా(2022 అదంపూర్ ఉప ఎన్నిక సహా) ఈసారి ఏడు స్థానాలను పెంచుకుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ 28 సీట్లు గెలవగా, ఈసారి తొమ్మిది స్థానాలు ఎక్కువ వచ్చాయి.

ప్రముఖుల గెలుపోటములు

లద్వా నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ 16 వేల మెజారిటీతో గెలిచారు. కాంగ్రెస్ కీలక నేత భూపిందర్ సింగ్ హుడా, హిసార్ నుంచి స్వతంత్ర అభ్యర్థి, దేశంలోనే ధనవంతురాలు సావిత్రి జిందాల్ విజయం సాధించారు. జులానా నుంచి మొదటిసారి బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి, రెజ్లర్ వినేశ్ ఫోగట్ 6,015 ఓట్ల తేడాతో ప్రత్యర్థి యోగేశ్ కుమార్‌పై గెలుపొందారు. ఐఎన్ఎల్‌డీ కీలక నేత అభయ్ చౌతాలా ఓటమి చవిచూశారు. జన్‌నాయక్ జనతా పార్టీ(జేజేపీ) నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి దుశ్యంత్ చౌతాలా సైతం ఓడిపోయారు.

ఎగ్జిట్ పోల్స్ అంచనాలు రివర్స్

హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎగ్జిట్ పోల్స్ సంస్థలేవీ సరిగ్గా అంచనా వేయలేకపోయాయి. స్థానిక సర్వే సంస్థలు మొదలు జాతీయ స్థాయిలో పేరుమోసిన సంస్థల వరకు అన్నీ ఈసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ వస్తుందని 50-70 సీట్లు రావొచ్చని చెప్పాయి. కానీ, అనూహ్యంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మరోసారి అధికారాన్ని దక్కించుకుంది.

పట్టు కోల్పోయిన చౌతాలా కుటుంబం

మాజీ ఉప ప్రధాని దేవీలాల్ కుటుంబం ఈ ఎన్నికలతో హర్యానా రాజకీయాల్లో పూర్తిగా పట్టు కోల్పోయింది. దేవీలాల్ తనయుడు ఓంప్రకాశ్ చౌతాలా నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ పార్టీకి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదరణ ఉండేది.

బీజేపీ శ్రేణులతో విజయోత్సవం జరుపుకుంటున్న హర్యానా సీఎం సైనీ

ఎన్నికల ఫలితాలు

మొత్తం సీట్లు: 90 మ్యాజిక్ ఫిగర్:46

పార్టీ	గెలిచిన సీట్లు
బీజేపీ	48
కాంగ్రెస్	37
ఐఎన్ఎల్‌డీ	2
ఇతరులు	3

2018 వరకు హర్యానా రాజకీయాల్లో ఐఎన్ఎల్‌డీ ప్రభావం ఉండేది. చౌతాలా కుటుంబంలో విభేదాలతో ఓంప్రకాశ్ చౌతాలా పెద్ద కుమారుడు అజయ్ సింగ్ చౌతాలా జన్‌నాయక్ జనతా పార్టీని స్థాపించారు. 2019 ఎన్నికల్లో ఈ పార్టీ 10 సీట్లు సాధించింది. ఆ ఎన్నికల్లో బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో జేజేపీ కింగ్‌మేకర్ అయ్యింది. అజయ్ సింగ్ చౌతాలా కుమారుడు దుశ్యంత్ చౌతాలా ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు. లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీతో జేజేపీ పొత్తు విచ్ఛిన్నమైంది. ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన జేజేపీ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేదు. దుశ్యంత్ చౌతాలా సైతం ఓడారు. ఐఎన్ఎల్‌డీ రెండు స్థానాలకే పరిమితమైంది.

మరోసారి సీఎంగా సైనీ!

హర్యానా ముఖ్యమంత్రిగా మరోసారి నాయబ్ సింగ్ సైనీ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. కొన్ని నెలల ముందే మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం పదవి నుంచి తప్పించి సైనీకి బీజేపీ హైకమాండ్ పగ్గాలు అప్పగించింది. ఓబీసీ నాయకుడైన సైనీ సారథ్యంలో బీజేపీ హర్యానాలో అనూహ్యంగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో మరోసారి సైనీకే సీఎం బాధ్యతలు అప్పగించాలని బీజేపీ నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

ఉదయం స్వీట్లు.. మధ్యాహ్నానికి పాట్లు

హర్యానా ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కాంగ్రెస్ విచిత్ర పరిస్థితులను ఎదుర్కొన్నది. లెక్కింపు ఆరంభంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ట్రెండ్స్ ఉండటంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. కార్యకర్తలు స్వీట్లు పంచుకొని, డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేశారు. అయితే, కొద్దిసేపటికే ఫలితాల సరళి బీజేపీకి అనుకూలంగా మారడంతో ఉసూరుమన్నారు. కాగా, ఓట్ల లెక్కింపుపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తం చేశారు. మ్యానిపులేషన్ ద్వారా బీజేపీ హర్యానాలో గెలిచిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. 14 నియోజకవర్గాల్లో ఈవీఎంల పనితీరు, లెక్కింపు ప్రక్రియపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. తమ గెలుపును లాక్కున్నారని, ఈ ఫలితాలను అంగీకరించలేమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విమర్శలను బీజేపీ తప్పుబట్టింది. ఆ పార్టీ ఉదయం 8.30కు జిలేబీలు పంచుకుందని, 11.30కు ఎన్నికల కమిషన్‌ను విమర్శిస్తున్నదని బీజేపీ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా ఎద్దేవా చేశారు.

ఇండియా కూటమికి జమ్ముకశ్మీర్ 'జై'

- 49 సీట్లతో అధికారం కైవసం చేసుకున్న నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి
- 29 సీట్లకే పరిమితమైన భారతీయ జనతా పార్టీ
- బోణీ కొట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ
- ఒమర్ అబ్దుల్లాకే సీఎం పదవి!

శ్రీనగర్‌లో సంబరాలు చేసుకుంటున్న నేషనల్ కాన్ఫరెన్స్ కార్యకర్తలు

శ్రీనగర్, అక్టోబర్ 8: పదేండ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జమ్ము కశ్మీర్ ప్రజలు ఇండియా కూటమికి జై కొట్టారు. 90 స్థానాలకు గానూ 49 స్థానాలను గెలిపించి అధికారాన్ని కట్టబెట్టారు. మొదటిసారి ఒంటరిగా అధికారంలోకి రావాలని భావించిన బీజేపీ 29 సీట్లకు పరిమితమైంది. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ సత్తా చాటింది. ఏకంగా 42 స్థానాలను ఆ పార్టీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్‌కు మాత్రం చేదు ఫలితాలే వచ్చాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు ఉన్నప్పటికీ కేవలం ఆరు స్థానాలను మాత్రమే ఆ పార్టీ గెలుచుకుంది. 2014లో బీజేపీతో కలిసి అధికారాన్ని చేపట్టిన పీడీపీ ఈసారి దారుణ పరాభవాన్ని ఎదుర్కొన్నది. అప్పుడు 28 సీట్లు గెలిచిన ఆ పార్టీకి ఇప్పుడు కేవలం మూడు స్థానాలే దక్కాయి. ఇండియా కూటమి భాగస్వామిగా సీపీఎం ఒక స్థానాన్ని దక్కించుకుంది. స్వతంత్రులు, వేర్పాటువాద అనుకూల నాయకులు కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఒక స్థానాన్ని గెలుచుకొని ఖాతా తెరిచింది.

జమ్ము ప్రాంతానికే బీజేపీ పరిమితం

జమ్ము కశ్మీర్‌లో అధికారంపై కన్నేసిన బీజేపీ ప్రతిపక్షానికే పరిమితమైంది. ఆ పార్టీ 62 స్థానాల్లో పోటీ చేసి 29 స్థానాల్లో మాత్రమే గెలిచింది. 2014లో 25 సీట్లు గెలిచిన ఆ పార్టీ ఇప్పుడు నాలుగు స్థానాలను పెంచుకుంది. అయితే, బీజేపీ కేవలం జమ్ము ప్రాంతానికే పరిమితమైంది. గెలిచిన 29 స్థానాలూ ఇక్కడివే. కశ్మీర్ లోయలో ఆ పార్టీ ఒక్క స్థానాన్ని సైతం గెలుచుకోలేకపోయింది. కశ్మీర్ ప్రాంతంలో 20 మందికి పైగా బీజేపీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. బీజేపీ జమ్ము కశ్మీర్ అధ్యక్షుడు రవీందర్ రైనాతో పాటు బీజేపీకి చెందిన ఇద్దరు మాజీ మంత్రులు ఓటమి చవిచూశారు.

ఎన్నికల ఫలితాలు

పార్టీ	సీట్లు
నేషనల్ కాన్ఫరెన్స్	42
కాంగ్రెస్	06
సీపీఎం	01
బీజేపీ	29
అవామీ ఇత్తెహాద్	01
స్వతంత్రులు	06
ఆమ్ ఆద్మీ పార్టీ	01

కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలింది. పొత్తులో భాగంగా 32 స్థానాలకు పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం ఆరు స్థానాలను మాత్రమే గెలుచుకుంది. గత ఎన్నికల్లో 12 స్థానాలు సాధించిన ఆ పార్టీ ఇప్పుడు ఆరు స్థానాలను కోల్పోయింది. జమ్ము ప్రాంతంలో అయితే కాంగ్రెస్‌కు చేదు ఫలితాలు వచ్చాయి. జమ్ములో 29 స్థానాలకు పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం రాజౌరి స్థానాన్ని మాత్రమే 1,404 ఓట్ల మెజార్టీతో గెలవగలిగింది. కాంగ్రెస్ నుంచి మాజీ ఉప ముఖ్యమంత్రి తారాచంద్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ్ భల్లాతో పాటు పలువురు కీలక నేతలు ఓటమి చవిచూశారు.

మరోసారి సీఎంగా ఒమర్ అబ్దుల్లా

ఇండియా కూటమికి మ్యాజిక్ ఫిగర్ రావడంతో ఒమర్ అబ్దుల్లా సీఎం కానున్నట్టు ఆయన తండ్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. ప్రస్తుతం నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడిగా ఉన్న ఒమర్ అబ్దుల్లా 2009 నుంచి 2014 మధ్య జమ్ము కశ్మీర్ సీఎంగా పని చేశారు. 1999 నుంచి 2002 వరకు కేంద్రమంత్రిగానూ వ్యవహరించారు.

వేర్పాటువాదుల తిరస్కరణ

వేర్పాటువాదిగా ముద్రపడి లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన ఇంజినీర్ రషీద్ ప్రభావం ఈ ఎన్నికల్లో పెద్దగా కనిపించలేదు. ఆయన నేతృత్వంలోని అవామీ ఇత్తెహాద్ పార్టీతో పాటు వేర్పాటువాద అనుకూల జమాతే ఇస్లామీ ఈ ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తిన్నాయి. అవామీ ఇత్తెహాద్ 44 స్థానాలకు పోటీ చేయగా, జమాతే ఇస్లామీ నాలుగు స్థానాల్లో పోటీ చేసి, మరో నాలుగు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు తెలిపింది. అయితే. కుల్‌గాం నుంచి జమాతే ఇస్లామీ మద్దతు ఇచ్చిన నయర్ అహ్మద్ రెషీ, లంగేట్ నుంచి ఎంపీ ఇంజినీర్ రషీద్ సోదరుడు, అవామీ ఇత్తెహాద్ అభ్యర్థి కుర్షీద్ అహ్మద్ షేక్ మాత్రమే విజయం సాధించారు. ఉగ్రవాది అఫ్జల్ గురు సోదరుడు అజాజ్ అహ్మద్ గురుకు కేవలం 129 ఓట్లే వచ్చాయి.

హైఫాపై విరుచుకుపడ్డ హెజ్బొల్లా

- 100కుపైగా రాకెట్ల ప్రయోగం
- ఐరన్ డోమ్‌ను దాటుకొని నగరంపై పడిన రాకెట్లు
- ప్రతిగా బీరుట్‌పై ఐడీఎఫ్ దాడులు
- హెజ్బొల్లా లాజిస్టిక్స్ హెడ్ హతం

టెల్ అవీవ్, అక్టోబర్ 8: లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్, ఇజ్రాయెల్ మధ్య పోరు ఉధృతమవుతున్నది. ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంపై మంగళవారం హెజ్బొల్లా విరుచుకుపడింది. 100కుపైగా రాకెట్లను ప్రయోగించింది. ఇజ్రాయెల్‌కు రక్షణ కవచంలా నిలుస్తున్న ఐరన్‌డోమ్‌ను దాటుకుని ఇవి హైఫాపై పడినట్లు హెజ్బొల్లా ప్రకటించింది. అయితే మెజార్టీ రాకెట్లను ఐరన్‌డోమ్‌తో కూల్చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. కొన్ని రాకెట్లు హైఫా శివారులోని నివాస ప్రాంతాలపై పడినట్టు పేర్కొన్నది. కనీసం ఐదు రాకెట్లు నగరంపై పడినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. మరోవైపు, హెజ్బొల్లా దాడులకు ప్రతిగా బీరుట్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. బీరుట్‌లో తమ ఇంటెలిజెన్స్ విభాగం సూచనలతో జరిపిన వైమానిక దాడిలో హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ ప్రధాన కార్యాలయం అధిపతి, లాజిస్టిక్స్ యూనిట్ హెడ్ సొహైల్ హుస్సేన్ హుస్సేనీ హతమైనట్టు ఐడీఎఫ్ అధికారులు తెలిపారు. దీనిపై హెజ్బొల్లా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

హైఫాలో హెజ్బొల్లా రాకెట్ల విధ్వంసం

హెజ్బొల్లా తాత్కాలిక చీఫ్ ఖాసిం

ఇజ్రాయెల్‌తో పోరులో తమ అధినేత హసన్ నస్రల్లాను కోల్పోయిన అనంతరం ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లాలో ఇప్పటివరకు అంతగా ప్రాచుర్యం పొందని నేతలు వెలుగులోకి వస్తున్నారు. నస్రల్లా మృతితో ప్రస్తుతం హెజ్బొల్లాకు తాత్కాలిక చీఫ్‌గా వ్యవహరిస్తున్న షేక్ నయీమ్ ఖాసింపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. మంగళవారం నయీమ్ టెలివిజన్‌లో మాట్లాడుతూ తమకు తిరుగులేని పోరాటతత్వం ఉందని, తమతో ఇజ్రాయెల్ దీర్ఘకాలం పోరును సాగించలేదని అన్నారు.

ఎవరీ ఖాసిం?

ఖాసింకు నస్రల్లా అంతటి వాగ్ధాటి లేదు. అయితే గతంలో తనను హత్య చేస్తారన్న భయంతో నస్రల్లా అజ్ఞాతంలోకి వెళ్లి కేవలం టెలివిజన్ ప్రసంగాలకే పరిమితమైనప్పుడు ఖాసిం పార్టీ సభలు, సమావేశాలు చురుకుగా నిర్వహించడమే కాక, విదేశీ చానళ్లకు ముమ్మరంగా ఇంటర్వ్యూలు ఇచ్చేవాడు. ఇప్పటికే ఆయనను అమెరికా ఉగ్రవాదిగా ప్రకటించింది. కాగా, బహిరంగ ప్రకటనల విషయంలో నస్రల్లా కంటే ఖాసింను చాలా మంది అభిమానించే వారని సంస్థలోని సీనియర్ సభ్యుడు మోహనడ్ హగే అలీ తెలిపాడు. దక్షిణ లెబనాన్‌లోని క్వాఫర్ ఫిలా అనే పట్టణంలో జన్మించిన ఖాసిం లెబనాన్ యూనివర్సిటీలో కెమిస్ట్రీ చదివారు. ఈ సంస్థలో చేరకముందు చాలా ఏండ్లు కెమిస్ట్రీ టీచర్‌గా పనిచేశాడు.

సఫీద్దీన్ మృతి?

వారం క్రితం జరిగిన దాడిలో నస్రల్లా వారసుడు సఫీద్దీన్ మరణించి ఉండవచ్చునని ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గాలెంట్ మంగళవారం తెలిపారు.' ఇప్పుడు హెజ్బొల్లా నాయకుడు లేని సంస్థ' అని ఆయన వ్యాఖ్యానించారు.

రైళ్లలో నవరాత్రి స్పెషల్ భోజనం

150 స్టేషన్లలో అందుబాటులోకి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: నవరాత్రి పండుగ సీజన్‌లో ప్రయాణికుల ఆహార అలవాట్లను దృష్టిలో పెట్టుకొని ఇండియన్ రైల్వే 'నవరాత్రి వ్రత స్పెషల్ థాలి'ని అందుబాటులోకి తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 150కిపైగా రైల్వే స్టేషన్లలో రుచికరమైన 'నవరాత్రి స్పెషల్ థాలి' భోజనాన్ని ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చునని రైల్వే శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్, ముంబై సహా వివిధ స్టేషన్లలో ప్రత్యేక భోజనాన్ని ప్రయాణికులు పొందొచ్చునని, తయారీలో నాణ్యత, పోషకాహారం ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని రైల్వే శాఖ అధికార ప్రతినిధి మీడియాకు తెలిపారు. ఐఆర్‌సీటీసీ యాప్, ఈ-క్యాటరింగ్ వెబ్‌సైట్ నుంచి ప్రయాణికులు తమ పీఎన్ఆర్ నంబర్‌తో ప్రత్యేక భోజనాన్ని ఆర్డర్ చేయవచ్చునని చెప్పారు.

మెషీన్ లెర్నింగ్ ఆవిష్కరణలకు నోబెల్

- భౌతిక శాస్త్రంలో ఇద్దరికి పురస్కారం
- జాన్ హోప్‌ఫీల్డ్, హింటన్‌కు అవార్డు

స్టాక్‌హోమ్, అక్టోబర్ 8: భౌతిక శాస్త్రంలో విశేష సేవలు అందించిన శాస్త్రవేత్తలు జాన్ హోప్‌ఫీల్డ్, 'గాడ్ ఫాదర్ ఆఫ్ ఏఐ' జెఫ్రీ హింటన్‌కు ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం 2024కు గానూ భౌతిక శాస్త్రంలో వీరిని నోబెల్ పురస్కారానికి ఎంపిక చేసింది. 'వీరిద్దరూ భౌతికశాస్త్రంలోని సాధనాలను ఉపయోగించి నిర్మించిన పద్ధతులు నేడు శక్తిమంతంగా మారిన మెషీన్ లెర్నింగ్‌కు పునాదులు వేయడానికి ఉపయోగపడ్డాయి. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్ ఆధారిత మెషీన్ లెర్నింగ్ ప్రస్తుతం ఇంజినీరింగ్‌లో, నిత్య జీవితంలో విప్లవాత్మక శాస్త్రంగా మారింది' అని రాయల్ స్వీడిష్ అకాడమీ ప్రకటించింది. కాగా, ప్రస్తుతం జాన్ హోప్‌ఫీల్డ్ అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో, జియోఫ్రే హింటన్ కెనడాలోని టొరంటో యూనివర్సిటీలో ప్రొఫెసర్లుగా పని చేస్తున్నారు. వీరికి నోబెల్ పురస్కారం కింద రూ.8.4 కోట్ల నగదు బహుమతి అందనుంది.

ఏఐ దుష్పరిణామాలపై హింటన్ ఆందోళన

నోబెల్ పురస్కారానికి ఎంపికైన తర్వాత జరిగిన ఓ కార్యక్రమంలో హింటన్ మాట్లాడుతూ ఏఐ ద్వారా సంభవించనున్న దుష్పరిణామాలపై ఆందోళన పడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'పారిశ్రామిక విప్లవం లాంటి భారీ ప్రభావం ఏఐ ద్వారా కూడా ఉంటుంది.ఇది మెరుగైన వైద్యసేవలు అందించగలదు. ఉత్పాదకతను ఇది భారీగా పెంచుతుంది. అయితే, దీని చెడు పరిణామాల పట్ల కూడా మనం ఆందోళన చెందాలి. ఏఐ లాంటివి మన నియంత్రణను దాటిపోతే కలిగే ముప్పు గురించి ఆందోళన అవసరం' అని హింటన్ అన్నారు. ఏఐ రంగంలో నైతికతను పాటించడం, బాధ్యతాయుతమైన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

పతంజలి వర్సిటీకి న్యాక్ ఏ+ గ్రేడ్

బాబా రాందేవ్ హర్షం

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): యోగా గురువు బాబా రాందేవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సిటీ ఆఫ్ పతంజలికి న్యాక్ ఏ+ గ్రేడ్ దక్కింది. అన్ని యోగా యూనివర్సిటీల కంటే అత్యధిక స్కోరుతో ఈ గ్రేడ్ దక్కించుకోవడం పట్ల యూనివర్సిటీ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ చాన్సలర్ బాబా రాందేవ్ మాట్లాడుతూ, యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు వ్యక్తిత్వ నిర్మాణానికి యోగా దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భారతీయ శిక్షబోర్డ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎన్‌పీ సింగ్, కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ శ్రీనివాస్ వర్ఖేడి తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఒప్పందాన్ని సమీక్షిస్తాం

- విండ్ పవర్ ఒప్పందంపై శ్రీలంకలోని దిసనాయకే సర్కారు సంచలన ప్రకటన
- లోపాయికారి ఒప్పందమేనని విమర్శలు
- అదానీ కోసం రాజపక్సపై మోదీ ఒత్తిడి
- 2022లోనే చెప్పిన ఎంఎంసీ ఫెర్డినాండో

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): పొరుగు దేశం శ్రీలంకలో తమ వ్యాపారాన్ని విస్తరించాలని ఉవ్విళ్లూరుతున్న అదానీ గ్రూప్‌నకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గత ప్రభుత్వ పెద్దలతో అదానీ గ్రూప్ చేసుకొన్న లోపాయికారి ఒప్పందాలపై అనూరకుమార దిసనాయకే నేతృత్వంలోని శ్రీలంక కొత్త ప్రభుత్వం కన్నెర్రజేసింది. అదానీ గ్రూప్ దొడ్డిదారిన విండ్ పవర్‌ప్లాంటు కాంట్రాక్టు చేజిక్కించుకొన్నదన్న ఆరోపణలపై దృష్టి సారించింది. అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీతో చేసుకొన్న విండ్ పవర్ ఒప్పందంపై పునఃసమీక్షిస్తామని ఆ దేశ విదేశాంగ మంత్రి విజితా హెరాత్ మ